ప్రజాశక్తి

శనివారం 19 జులై 2025 | 5 | శ్రీ సత్యసాయి



రాష్ట్రం దాటుతున్న చౌక బియ్యం

పావగడ కేంద్రంగా అక్రమ దందా..

20 రోజుల్లో 3 లారీల బియ్యం పట్టివేత..

ప్రజాశక్తి-మడకశిర టౌన్



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న బియ్యం లారీ

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం దళారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా సబ్సిడీ బియ్యాన్ని రాష్ట్ర సరి హద్దులు దాటిస్తూ కర్నాటకలోని పలు ప్రాంతాలకు తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందుకు విజిలెన్స్ అధికారులు మడకశిర ప్రాంతంలో 20 రోజుల వ్యవధిలోనే 3 లారీల చౌక బియ్యాన్ని సీజ్ చేయడమే నిదర్శనం. చుట్టూ ఆంధ్ర ప్రాంతం ఉండడం, మడకశిరకు కూతవేటు దూరంలో ఉన్న కర్నాటకలోని పావగడ కేంద్రంగా ఈ చౌక బియ్యం దాందా సాగుతోంది. పావగడలోని ఓ నలుగురు వ్యాపారులు సరిహద్దులోని మడకశిర, హిందూపురం, పెనుకొండ, కళ్యాణదుర్గం ప్రాంతా ల్లో కార్డుదా రులు, రేషన్ డీలర్ల నుంచి పెద్దఎత్తున సబ్సిడీ బియ్యం సేకరించి పావగడ పట్టణంలోని గోదాముల్లో భద్ర పరిచి అక్కడి నుంచి కర్నాటకలోని శ్రీరంగపట్నం, మండ్యా, మద్దూర్, చెన్నపట్నం ప్రాంతంలోని మిల్లర్లకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడి నుంచి ప్రతి నెలా సుమారు 25 నుంచి 30 లారీల బియ్యాన్ని(ఒక్కో లారీలో 9 టన్నులకు పైగా) తరలిస్తున్నట్లు తెలుస్తోంది. పావగడ నుంచి ఆంధ్ర సరిహద్దు కేవలం 10 కిలోమీటర్లు మాత్రమే ఉండడంతో చౌక బియ్యాన్ని చాకచక్యంగా సరిహద్దు దాటిస్తున్నారు. ఒకే లారీ డ్రైవర్ గతేడాదిలో అక్రమంగా చౌక బియ్యం తరలిస్తూ ఐదు సార్లు అధికారులకు పట్టుబడడంతో కేసులకు భయపడి ఆ డ్రైవర్ వృత్తిని వదిలి వేసినట్లు సమాచారం. అక్రమార్కులు నెలకు సరాసరి 1500 టన్నుల చౌక బియ్యం ఇక్కడి నుంచి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మడకశిర చుట్టూ కర్నాటక ప్రాంతం కావడంతో సులువుగా ఆంధ్ర ప్రాంతాన్ని దాటిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు ఎన్ని దాడులు చేసినా చౌక బియ్యం దందా యథేచ్ఛగా సాగుతూనే ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇకనైనా రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు నిఘాను మరింత పటిష్టం చేసి చౌక బియ్యం అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చౌక బియ్యం లారీ సీజ్

విజిలెన్స్ అధికారుల శుక్రవారం మడకశిర పట్టణంలో తనిఖీలు చేపట్టి చౌక బియ్యం తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకున్నారు. కర్నాటకలోని పావగడ నుంచి మడకశిర మీదుగా తుమకూరు జిల్లాకు తరలిస్తుండగా మడకశిర పట్టణ సమీపంలో విజిలెన్స్ అధికారులు లారీని పట్టుకున్నారు. అందులో 430 బస్తాల చౌక బియ్యం పట్టుబడింది. కేసు నమోదు చేసి బియ్యం లారీని మడశిర గోదాముకు తరలించారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ జమల్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ వెడల్పు ఆగినట్టే ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

◆ 6300 క్యూసెక్కుల ప్రవాహ వెడల్పు పనులు రద్దు

◆ భైరవానితిప్ప ఆధునీకరణ అటకెక్కినట్టే

హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం 6300 క్యూసెక్కుల పెంపుదలకు చేపట్టిన పనులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పుడు జరుగుతున్న 3850 క్యూసెక్కులతోనే సరిపెట్టుకోవాల్సి ఉంటుంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో హంద్రీనీవా మొదటి దశ ప్రవహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయం చేసింది. ఈ మేరకు టెండర్లు కూడా ఆహ్వానించి పనులను అప్పగించింది. కాని ఆ పనులు ప్రారంభమవలేదు. ఇప్పుడు వీటిని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా టెండర్లు పిలిచి ప్రారంభం కాని పనులు, 25 శాతం కంటే తక్కువ పని జరిగిన వాటిని రద్దు చేసింది. రాష్ట్రంలో రద్దయిన 71 పనుల్లో అనంతపురం జిల్లాకు సంబంధించి మూడు పనులున్నాయి. ఇందులో రెండు హంద్రీనీవాకు ప్రవాహ సామర్థ్యం పెంపుదలకు సంబంధించినవి ఉండగా, ఒకటి బిటిపి అభివృద్ధికి సంబంధించి ఉన్నాయి.

కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాల్లోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సాగు, తాగునీరు అందించే లక్ష్యంతో హంద్రీనీవా ప్రాజెక్టును చేపట్టారు. దీని కింద ఆరున్నర లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు 40 లక్షల మందికి తాగునీటి వసతి కల్పించాలన్నది లక్ష్యం. దీని అదనంగా అనేక ప్రాజెక్టులు తోడవడంతో హంద్రీనీవా నీటి అవసరం పెరిగింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు వస్తున్న 2800 క్యూసెక్కుల నీటి ప్రవాహంతో ఇక్కడి నీటి సమస్యలను పరిష్కరించలేమని డిమాండ్ రావడంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి హంద్రీనీవా మొదటి దశ ప్రవాహ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచుతూ నిర్ణయం చేసింది. 2021లో టెండర్లు పిలిచి రెండు ప్యాకేజీల్లో పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. అందులో 4.86 కిలోమీటరు నుంచి 88వ కిలోమీటరు వరకు కాలువ వెడల్పు పనులను మెఘా ఇంజినీరింగు సంస్థకు రూ.2484 కోట్ల విలువైన పనులను అప్పగించారు. ఆ తరువాత 88వ కిలోమీటరు నుంచి 216వ కిలోమీటరు వరకు రూ.2163 కోట్ల విలువైన పనులను డిఎస్ఆర్, విపిఆర్ జాయింట్ వెంచర్ సంస్థకు అప్పగించారు. ఇది కూడా 2021లోనే అప్పగిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు ఆరంభమవలేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవహ సామర్థ్యంతో 3850 క్యూసెక్కులకే కుదించి వెడల్పు పనులను చేపట్టింది. ఈ నేపథ్యంలో వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన 6300 క్యూసెక్కుల వెడల్పు పనులను రద్దు చేస్తూ శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇక హంద్రీనీవా ప్రవహ సామర్థ్యం ఇక 3850తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చే అవకాశముంది.





బిటిపి అభివృద్ధికి మంగళమే

భైరవానితిప్ప ప్రాజెక్టు మట్టి కట్టతోపాటు, కుడి కాలువకు నీటిని విడుదల చేసే ప్రాంతం దెబ్బతింది. దీని మరమ్మతుల కోసమని రూ.4.61 కోట్ల నిధులు 2022లో మంజూరయ్యాయి. ఇవి టెండరు ప్రక్రియ వరకు కూడా పోవడంతో ఈ పనులనూ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటికే బలహీనంగానున్న బిటిపి ప్రాజెక్టు అభివృద్ధికి నోచుకునే అవకాశాలు కనిపించడం లేదు.

సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్

జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్



సివిల్ సప్లై హమాలీ యూని యన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజును ఎన్నుకున్నారు. నాగరాజు మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలీల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. హమాలీలను ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీ వేతనాలు చెల్లించాలని కోరారు. సరుకు లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీలపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. 12 రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. మృతి చెందిన హమాలీ కార్మికుల కుటుంబాలకు రావాల్సిన నష్టపరిహారం, బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా రామకృష్ణ



ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా టిడిపి మండల సీనియర్ నాయకులు బొక్కసంపల్లి రామకృష్ణను నియమించారు. తనకు ఈ అవకాశం కల్పించిన మంత్రి సవితకు రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతన చైర్మన్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని కుర్లపల్లి గ్రామంలో శుక్రవారం అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో సీఈఓ లావణ్య, అధ్యక్షురాలు సుశీలమ్మ అధ్యక్షతన మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్ష, హింసపై నాటిక రూపంలో ప్రదర్శించారు. గృహ హింస, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది, న్యాయ సలహా కేంద్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మహిళా చట్టాలపై నాటిక రూపంలో అవగాహన కల్పిస్తున్న యువతులు

బలవంతపు భూసేకరణ తగదు

ప్రజాశక్తి-పెనుకొండ

సోలార్, గ్రీన్‌ఎనర్జీ, సెజ్‌ల పేరుతో వ్యవసాయ భూములను కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు ఇస్తున్న ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి పిలుపునిచ్చారు. ఈ అంశంపై ఈ నెల 20వ తేదీ నంద్యాలలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. హరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో రైతుల అనుమతి లేకుండా వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పనంగా కట్టబెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీ నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సివిల్ సప్లై యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సుధాకర్, హనుమంతు, వలి, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

రొద్దం : సోలార్, గ్రీన్‌ఎనర్జీ పేరుతో వ్యవసాయ భూములను కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు ధారాదత్తం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20వ తేదీ నంద్యాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు ఫకృద్దీన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర సదస్సుకు రైతులు పెద్దఎత్తున తరలి వెళ్లాలని కోరారు.



సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఈ నెల 27, 28 తేదీల్లో కదిరి పట్టణంలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి రంగప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ మహాసభల్లో గత మూడేళ్లలో పార్టీ చేపట్టిన పోరాటాలపై సమీక్షించుకొని రాబోవు మూడేళ్లలో అనుసరించా ల్సిన ప్రణాళికలను రూపొందిస్తారన్నారు. పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు హనుమయ్య, లక్ష్మీనారాయణ, కొండా వెంకటేశులు, గౌతమి, ఈడిగ రామకృష్ణప్ప, వెంకటేశులు, నాగభూషణ, రవి, గోవిందప్ప, పాల్గొన్నారు.

రైతుపై ఎలుగుబంటి దాడి

ప్రజాశక్తి-మడకశిర టౌన్



ఎలుగుబంటి దాడిలో గాయపడిన రైతు భూతరాజు

నియోజకవర్గ పరిధిలోని ఎస్.రాయపురం గ్రామ సమీపంలోని తన పొలంలో రైతు భూతరాజు వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఓ ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయ పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గాయపడిన భూతరాజును గ్రామస్తులు 108 వాహనం ద్వారా మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆసుపత్రికి వెళ్లి భూతరాజును పరామర్శించారు. అతడికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. మెరుగైన చికిత్స కోసం భూతరాజును హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

శిథిలావస్థలో బస్‌షెల్టర్..!

ప్రజాశక్తి-రొద్దం



ఓ వైపు గోడ కూలి శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్

మండలంలోని పెద్దగువ్వలపల్లి గ్రామంలో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన బస్సుషెల్టర్ పాతబడి శిథిలావస్థకు చేరింది. ఇప్పటికే ఓ వైపు గోడలు నెర్రెలు చీలి కొంతవరకూ పడిపోయి ప్రమాదకరంగా మారింది. గ్రామస్తులు, ప్రయాణికులు ఇందులో సేద తీరుతుంటారు. అయితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైతు సేవా కేంద్రానికి దారేది?

ముళ్ల పొదలతో మూసుకోపోయిన ప్రాంగణం

ప్రజాశక్తి-రొద్దం



ముళ్ల పొదలతో మూసుకోపోయిన రైతు సేవా కేంద్రం

స్థానిక పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న రొద్దం-1 రైతు సేవా కేంద్రం ప్రాంగణం మొత్తం ముళ్ల పొదలతో మూసుకుపోయింది. దీంతో కార్యాలయంలోకి వెళ్లాలంటే ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు భవనం చుట్టూ చెత్త, చెదారం పేరుకుపోయింది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రైతు సేవా కేంద్రం ప్రాంగణంలో ముళ్లపొదలు తొలగించి శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌డిటి కోసం విద్యార్థుల పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-రొద్దం



కేంద్ర ప్రభుత్వానికి రాసిన పోస్ట్‌కార్డులను చూపిస్తున్న విద్యార్థులు

కేంద్ర ప్రభుత్వం ఆర్‌డిటి సంస్థకు విదేశీ నిధులకు సంబంధించి వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని ఆర్.మరవపల్లి కెజిబివి, ఎంజెపి పాఠశాలల విద్యార్థులు పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు. విద్యార్థులు మొత్తం 500 కార్డులు రాసి పోస్ట్ బాక్స్‌లో వేశారు. విద్యార్థులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు ఆర్‌డిటి సంస్థ ఎన్నో రకాల సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రధానంగా పేద విద్యార్థులకు కార్పొరేట్ ఉద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. అలాంటి సంస్థకు రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డిటి ప్రతినిధులు వేణుగోపాల్, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

21న మడకశిరకు హోంమంత్రి

ప్రజాశక్తి-మడకశిర టౌన్

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఈ నెల 21వ తేదీ మడకశిరకు వస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. పట్టణంలో శుక్రవారం వారు మాట్లాడుతూ సోమవారం పట్టణంలో నిర్వహించ నున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్ర మంలో హోం మంత్రి అనిత ముఖ్యఅతిథిగా పాల్గొంటార ని జయప్రదం చేయాలని వారు కోరారు.

నగర పంచాయతీ అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మడకశిర నగర పంచాయతీ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన నరసింహరాజును శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ మడకశిర ప్రాజెక్టు అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి శ్రీదేవి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికే కూటమి ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టిందని వైసిపి నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నియోజకవర్గ పరిధిలోని బుల్లసముద్రం, ఛత్రం పంచాయతీ గ్రామాల్లో శుక్రవారం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్గనైజేషన్ కమిటీ పరిశీలకులు వజ్రభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ మధుమతిరెడ్డి, రాష్ట్ర సెక్రటరీ శ్రీలీల, రాష్ట్ర సెక్రటరీ భారతిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి లింగారెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, మాజీ మంత్రి నరసేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, నరసింహమూర్తి, సత్యనారాయణ, జడ్పిటిసిలు అనంత రాజు, భూతరాజు, మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎంపిపి కవితా సత్య నారాయణ, రంగేగౌడ్, పాల్గొన్నారు.



'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్‌కోడ్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించం

వినూత్న రీతుల్లో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

పారిశుధ్యకార్మికుల సమస్యలను పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామని పారిశుధ్య కార్మికుల యూనియన్ కార్యదర్శి జగదీష్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె శుక్రవారం కొనసాగింది. మూడు రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు అర్ధనగ్నంగా, కొబ్బరి చిప్పలు చేత పట్టుకుని నిరసన తెలిపారు. పట్టణంలోని ఇందిరా పార్క్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్ లో అర్ధ నగ్నంగా చేతిలో కొబ్బరి చిప్పలు పట్టుకొని మోకాళ్లపై కూర్చుని స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై నోరు మెదపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో కార్మికుల సత్తా ఎంటో చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, నాయకులు గుర్నాథ్, రామచంద్ర, బాబయ్య, మూర్తి, శంకరా, చంద్రశేఖర్, కుమాల్, బాలాజీ, చంద్ర, మూర్తి, కవితమ్మ, గంగ రత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని ఒప్పంద పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ ఆఫీసుముందు విధులను బహిష్కరించి సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ జెవి రమణ, కో కన్వీనర్ టి,అయూబ్ ఖాన్, జిల్లా అధ్యక్షులు నరేష్ పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం బాబు , లక్ష్మీ ఓబులేసు, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు బొగ్గు నాగరాజు, జయ మాట్లాడారు. ధర్మవరం మున్సిపల్ పరిధిలో కరోనా సమయంలో తీసుకున్నటువంటి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రోజువారి వేతనం పెంచాలని ఐదు నెలలుగా వినతి పత్రాలు ఇస్తున్నా ఇంతవరకు స్పందించలేదన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కార్మికులు సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. పట్టణ జనాభా ప్రతిపాదికన 400 మంది కార్మికులు ఉండాల్సుండగా దవలసిన ధర్మవరం మున్సిపాలిటీలో కేవలం 253 మంది కార్మికులతోనే పని చేయించుకుంటూ వారిపైన పని భారం మోపడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. అదేవిధంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు నేటితో 23 రోజులకు చేరుకుంది. కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని, అదేవిధంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు అనారోగ్య కారణాలవలన చనిపోయిన వారి కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘంల నాయకులు అనిల్, వెంకట రాముడు, బి.ప్రసాద్, ఆదినారాయణ పాల్గొన్నారు.



పుట్టపర్తిలో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు



హిందూపురంలో అర్ధనగ్నంగా, కొబ్బరి చిప్పలు పట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 6వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ముందు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. వీరి నిరసనకు పారిశుధ్య కార్మికులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు, మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో సమ్మె కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ, గణేష్, సాయి, సద్దాం హుస్సేన్, రమేష్, రామదాసు, సాయినాథ్ రెడ్డి, పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు నాగార్జున, పెద్దన్న, రామయ్య, నరసింహులు, గోవిందు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

"ప్రభుత్వాలు.. పాలకులు మారుతున్నారు తప్పా ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. అభివృద్ధిపై పాలకులకు చిత్త శుద్ధి కొరవడింది. వ్యక్తి స్వార్థం.. వ్యక్తిగత ప్రయోజనమే రాజకీయాల్లో కన్పిస్తోంది. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి ఇలా అన్నింటిపై నిర్లక్ష్యం కారణంగా జిల్లా అభివృద్ధి ముందుకు సాగడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. సమస్యలను ఎలుగెత్తి చాటుతూ, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా ఉన్న ప్రజాశక్తి లాంటి పత్రికలకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది." అని పలువురు వ్యక్తలు పేర్కొన్నారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం ఎన్జీవో హోంలో ప్రజాశక్తి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాశక్తి సిబ్బంది రవిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా సమగ్రాభివృద్ధిపై పలువురు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం..!

- పాలకులకు కొరవడిన చిత్తశుద్ధి
- ప్రజా ఆధారిత రంగాలు నిర్వీర్యం
- విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులపై దృష్టి సారించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రజాశక్తి ఆధ్వర్యంలో సమావేశం

బనకచర్ల.. మోసపూరిత హామీ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం చెబుతున్న బనకచర్ల ప్రాజెక్టు ఓ మోసపూరిత హామీ. ఈ ప్రాజెక్టు 50 సంవత్సరాలైన పూర్తి కాదు. అలాంటిది త్వరితగతి పూర్తి చేసి రాయలసీమను సశ్యామలం చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వడం హాస్యాస్పదం. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు కేటాయించి శ్రీశైలం ప్రాజెక్ట్‌లో మిగులు జలాలను మళ్లిస్తే రాయలసీమకు ప్రతిఫలం ఉంటుంది. హంద్రీనీవా గొప్ప ప్రాజెక్టుగా ఉన్నా ఎకరాకు కూడా నీటిని వినియోగించని దుస్థితి ఉంది. సాగునీరు, వ్యవసాయంపై పాలకులు దృష్టి సారిస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యం అవుతుంది.

ఎస్ఎం.బాషా, సాగునీటి సాధన సమితి అధ్యక్షులు.

బనకచర్లతో లాభం కంటే నష్టమే ఎక్కువ



. రాయలసీమ జిల్లాలకు 200 టిఎంసిల నీటిని తీసుకొచ్చే లక్ష్యంగా బనకచర్ల వంటి గొప్ప ప్రాజెక్ట్‌ను నిర్మిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతుండటం హాస్యస్పదంగా ఉంది. బనకచర్ల ప్రాజెక్టుతో లాభాల కంటే నష్టాలే అధికంగా ఉన్నాయన్న సత్యాన్ని పాలకులు గ్రహించాలి. బనకచర్ల విషయంలో ఢిల్లీ పెద్దలను భాగస్వామ్యం చేసి రెండు రాష్ట్రాల మధ్య తగాదాలను వారి చేతుల్లో పెట్టి చట్టబద్ధంగా మార్చే ప్రయత్నం చేశారు. కృష్ణా, గోదావరి జలాల మొత్తం వివాదాలు ఏమున్నాయో పరిశీలించడానికి నిపుణుల కమిటీ వేశారు. రెండు రాష్ట్రాలు సమస్యను కేంద్రం వద్దకు తీసుకెళ్లడం, కమిటీలు వేయడంతో అంటే ఢిల్లీ పెద్దలు అజమాయిషీలోకి వెళ్లడమే అన్న అంశాన్ని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గ్రహించలేక పోయారు. ఎన్నికల్లో లబ్ధి కోసం భవిష్యత్‌లో నిపుణుల కమిటీ తెలంగాణాకే మొగ్గుచూపే అవకాశం ఉంది. సీనియర్ ముఖ్యమంత్రిని అని చెప్పుకునే నారా చంద్రబాబు నాయుడుకు ఇది తెలియనట్లు వ్యవహరించడడం బాధాకరం.

వి.రాంభూపాల్; సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

కాలువల ఏర్పాటు అవసరం



దశాబ్దాలుగా అనంతపురం జిల్లా కరువుకు గురై వ్యవసాయ రంగం కుదేలైంది. ఉన్న సాగు వనరులు వినియోగించుకునేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలో విఫలం చెందాయి. హంద్రీనీవా ప్రాజెక్టు ప్రధానంగా ఉన్నా కాలువలు లైనింగ్ చేయని దుస్థితి నెలకొంది. హెచ్ఎల్‌సి ఆయకట్టు నీరు వచ్చినా వినియోగించలేని పరిస్థితి ఉంది. ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి వస్తున్న నీటిని సక్రమంగా వినియోగించేలా కాలువలు నిర్మించాలి. అత్యధిక మంది వ్యవసాయ రంగంపైన ఆధారపడి జీవిస్తున్నారు. వారందరికీ ఉపాధి కల్పించడం కంటే గొప్ప అభివృద్ధి మరొకటి ఉండదు. ఆ దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలి. వాటితో పాటి సహజ వనరులు లభించే ప్రాంతంలో వాటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. పాలకులు హామీలతో సరి పెట్టకుండా ఆచరణలో చేసి చూపించి ప్రజల ఆదరణ పొందాలి.

శివారెడ్డి, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి.

ప్రజా ఆధారిత రంగాలు అభివృద్ధి చేయాలి



ప్రజలు ఎక్కువ అధారపడే రంగాలను అభివృద్ధి చేయకుండా ఎలాంటి అభివృద్ధీ సాధ్యం కాదు. అది పాలకులకు తెలిసినా అటువైపు దృష్టి సారించరు. సాగుకు యోగ్యమైన 40 శాతం భూమికి నీరు అందిస్తే వ్యవసాయం వృద్ధి చెందుతుంది. పంటలకు గిట్టుబాటు ధర కల్పించే అంశంపై పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ఏడాదికేడాది రైతుల ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయి. బనకచర్లకు వేల కోట్లు ఖర్చు పెట్టి నీరు అందిస్తామంటున్న పాలకులు తొలుత హంద్రీనీవా కాలువలు వెడల్పు చేస్తే జిల్లాకు మేలు జరుగుతుంది. ప్రత్యేక హోదా లేకుండా పరిశ్రమలు రావడం అసాధ్యం.

కెవి.రమణ, అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు.

తర'గతి' మారాలి



దేశాభివృద్ధి తరగతి గదుల్లోనే నిర్ణయించ బడుతుందని డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పారు. అయితే నేటి పాలకులు తరగతి గదుల గతిని మార్చే తీరిక లేక పరిపాలన సాగిస్తున్నారు. రాజకీయ పార్టీలకు విద్యా వ్యవస్థ పట్టని అంశంగా తయారైంది. నాణ్యమైన విద్య ప్రభుత్వ విద్యా రంగంలో అందిస్తే ప్రశ్నించే తత్వం పెరుగుతుందనే భావనతో ప్రభుత్వాలు కుట్రతో విద్యను నిర్వీర్యం చేస్తున్నాను. ప్రయివేటు బడులు పుట్టుకొస్తుండటంతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. విశ్వ విద్యాలయాల్లో బోధించే ప్రొఫెసర్ల నియామకాలు లేవు. పరిశోధన విద్యార్థులకు ప్రోత్సాహం కరువైంది. ప్రభుత్వ విద్యపై పట్ల ప్రభుత్వాల ఉదాసీన వైఖరి వీడి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలి.

చంద్రశేఖర్, మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్.

హెచ్చుమీరిన అవినీతి



కంప్యూటర్ డాక్టర్‌రేట్‌లు వచ్చి అసలైన డాక్టరేట్‌లకు విలువ లేకుండా పోయింది. రూ.3 లక్షలు ఇస్తే డాక్టరేట్ వచ్చే దౌర్భాగ్య రోజులు రావడం సిగ్గుచేటు. సమాజంలో విద్యా, వైద్యం, మద్యం రంగాలను పాలకులు లాభసాటిగా మార్చుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు లేవు. ప్రయివేటు రంగంలో శ్రమ దోపిడీ జరుగుతోంది. న్యాయమైన పని చేయించు కునేందుకు కూడా లంచం ఇవ్వాల్సిన పరిస్థితులను పాలకులు, ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. నేటి పాలకులు విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయిస్తూ సమస్యల్లో ప్రజలను నెట్టివేస్తున్నారు. ప్రశ్నించే వారికి కులాన్ని అంటగట్టి విమర్శలకు దిగుతున్నారు. అభివృద్ధి కోసం ప్రజలందరూ ఐక్యంగా గొంతెత్తాల్సిన అవసరం ఉంది.

తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, మానవతా రక్తదాతల సంస్థ వ్యవస్థాపకులు.

కరువులో ప్రథమ స్థానమే..!



ఉమ్మడి అనంతపురం జిల్లా నిత్యం కరువు కాటకాటకాలకు నిలయంగా మారింది. ఈ జిల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జిఎస్‌టి రూపంలో పన్నులు చెల్లించడంలో ప్రథమ స్థానంలో ఉన్నా, అభివృద్ధిలో మాత్రం వెనుకంజలో ఉంటూ కరువులో అగ్రస్థానంలో ఉండడం గమనార్హం. జిల్లా ప్రజలు, వ్యాపారులు నిజాయితీగా పన్నులు చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ పన్నుల సొమ్మును ప్రజలకు ఉపయోగించడం లేదు. దీంతో అభివృద్ధి సామాన్యుల దరి చేయడం లేదు. ప్రభుత్వాలు పరిశ్రమలకు ప్రోత్సాహాలు అందించాలి. కోట్లాది మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి. వ్యవసాయం అభివృద్ధి చెందనంత వరకు జిల్లా అభివృద్ధి చెందలేదు.

రంగారెడ్డి, చాంబర్స్ ఆఫ్ కామర్స్ మెంబర్.

ఎపిఐఐసి భూముల్లో పరిశ్రమలు పెట్టాలి



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎపిఐఐసికి సంబంధించిన భూములు విస్తారంగా ఉన్నాయి. హిందూపురం, గుత్తి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిలో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించే చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలి. ఇండస్ట్రియల్ కారిడార్‌లు ఏర్పాటు చేస్తామంటున్న పాలకులకు ఈ భూములు కనిపించనట్లు ఉన్నాయి. ప్రజలు చైతన్యం వంతులై పరిశ్రమల స్థాపన కోసం ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. మహిళలు కష్టాన్ని నేస్తంగా భావించి జీవిస్తున్న వారు 65 శాతం మంది ఉన్నారు. వ్యవసాయ రంగమైన, పారిశ్రామిక రంగమైన ఏ రంగంలోనైనా మహిళలు శ్రమిస్తున్నారు. ఉమెన్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు ఏర్పాటు చేసి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

పద్మ నారాయణరెడ్డి,ఉమెన్స్ క్లబ్ కార్యదర్శి న్యాయవాది.

పాలకులు చిత్తశుద్ధితో పని చేయాలి

పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించి జిల్లా అవృద్ధికి తోడ్పాటు అందించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న పలువురు పేర్కొన్నారు. వ్యవసాయం, సాగునీరు, వైద్యం, ఉపాధిపై దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి చేయకుండా హామీలతో కాలం వెల్లదీస్తే అనంత అభివృద్ధి ఎండమావిగానే ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ప్రజాప్రతినిధులు రాజకీయాలు పక్కన బెట్టి జిల్లా అభివృద్ధికి పాటుబడాలి. ఈకార్యక్రమంలో మానవతా సలీమాలిక్, రచయిత రియాజుద్దీన్, రెడ్స్ వెంకటస్వామి, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజమోహన్, ప్రజారోగ్య వేదిక శ్రీనివాసరావు, ప్రజాశక్తి సిబ్బంది, విలేకరులు పాల్గొన్నారు.

పది మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో ఆర్అండ్‌బి ప్రహరీని కొందరు దౌర్జన్యంగా కూల్చివేయడంపై కారు డ్రైవర్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన డ్రైవర్‌ను ప్రహరీ కూల్చిన వారు బెదిరిస్తున్నట్లు తెలియడంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడున్న కొందరు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో రమేష్, ఉబేదుల్లా, అంజి, పాండురంగ, బాబ్‌జాన్, రఫిక్, సురేష్, షఫీఉల్లా, మోహన్, జయకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు సిఐ శేఖర్ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి బత్తలపల్లి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందికి పడటంతో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని డి. చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణ తన కుటుంబంతో కలిసి బెంగుళూరులో నివాసం ఉంటున్నాడన్నారు. గ్రామంలో మొహరం పండుగ జరుగుతున్న సందర్భంగా స్వగ్రామానికి ఆదినారాయణ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చినట్లు తెలిపారు. ఈనెల 6న ఆదినారాయణ కుమారుడు గురు ప్రసాద్(25) పనిమీద కట్ట కింద పల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్లాడన్నారు. అక్కడనుండి తిరిగి వస్తున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన పడ్డాడని తీవ్ర గాయాలపాలైన గురుప్రసాద్‌ను బెంగుళూరుకు తరలించారని చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ గురుప్రసాద్ గురువారం మృతి చెందినట్లు ఆదినారాయణ ఫిర్యాదు చేశాడన్నారు. ఆదినారాయణ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్యాన్సర్ పై అవగాహన

ప్రజాశక్తి - బత్తలపల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆర్డీటీ సహకారంతో మహిళలకు క్యాన్సర్ పై అవగాహన, ఉచిత సెర్వేక్స్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు గోవర్ధన్ నాయుడు, డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్ డి టి సహకారంతో దాదాపు 30 మంది మహిళలకు ఉచిత సెర్విక్స్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ ముందస్తు నివారణకు అవసరమైన హెచ్పీవీ వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ వైద్య సిబ్బంది డాక్టర్ జ్యోతి, డాక్టర్స్ సుప్రజ, డాక్టర్ శిరీష, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

దోమల నియంత్రణలో భాగంగా మండలంలోని డి. చెర్లోపల్లి గ్రామంలో గత రెండు రోజులుగా వైద్య సిబ్బంది పర్యటిస్తూ విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం వల్ల దోమలు ఉత్పత్తి పెరిగి విషజ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరించడంతో పంచాయతీ కార్యదర్శి పారిశుధ్య కార్మికులతో కాలువలను శుభ్రం చేయించారు. పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి ఆధ్వర్యంలో కాలువల్లో చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. అంతకు ముందు బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అశ్వర్థనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు డేవిడ్, గంగాదేవి, హెల్త్ ప్రొవైడర్ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, మహిళా పోలీసు గురుదేవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


డ్రయినేజీ శుభ్రం చేస్తున్న దృశ్యం

డిపిఒపై దుర్భాషలాడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తలుపుల

అనంతపురం జిల్లా పంచాయతీ అధికారిపై దుర్భాషలాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈమేరకు వారు శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ నందు ఎంపీడీవో నసీమాకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని జిల్లా స్థాయి అధికారి పట్ల రాజకీయ నాయకులు తమ ఇష్టానుసారంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఓ జిల్లా స్థాయి అధికారి పై అలా ప్రవర్తిస్తూ ఉంటే మండలాల్లో పనిచేస్తున్న వారి పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు అర్థం చేసుకోవచ్చున్నారు. ఉద్యోగులపట్ల అసభ్య పదజాలంతో మాట్లాడిన వారిని కఠినంగా శిక్షించి ముమ్మందు ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని మండల పంచాయతీ కార్యదర్శిల సంఘం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ మక్బుల్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం

ప్రజాశక్తి - తలుపుల

కదిరి నియోజకవర్గం వైసిపి సమన్వయ కర్త మక్బుల్‌పై నల్లచెరువు మండలం జడ్పిటిసి విశ్వనాథ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని ఆపార్టీ స్థానిక నాయకులు అన్నారు. ఈ మేరకు వారు స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. మక్బుల్ అహ్మద్ నిజాయితీతో పార్టీ కోసం పనిచేస్తున్నారని పార్టీ ఆదేశాలతో ముందుకు కొనసాగుతున్నారని అన్నారు. నల్లచెరువు మండలంలో విశ్వనాథ్‌రెడ్డి సత్తా ఏంటో ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఫయాజ్ మహమ్మద్, ఎంపీపీ మహమ్మద్ రఫీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మానవ అక్రమ రవాణా ఏ రూపంలో జరిగినా దానిని అరికట్టాల్సిన బాధ్యత అందరిమీద ఉందని ధర్మవరం రైల్వే స్టేషన్ మేనేజర్ చల్లా. నరసింహనాయుడు అన్నారు. ఈ నెల 30 వ తేదీన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం సత్యసాయి జిల్లాలోని ధర్మవరం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో జస్ట్ రైట్స్ సంస్థ సహకారంతో సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు అధ్యక్షతన ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, బాలికల అక్రమ రవాణా పై రైల్వే ప్రాంగణంలోని ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి ఎఫ్, ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఐ. కోటేశ్వరరావు, జిఆర్పి ఎస్ఐ వెంకటేశ్వర రెడ్డి, అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ పుల్లయ్య, సమత స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు, వెంకటేశ్వర్లు, మనోహర్ నాయుడు ,ఉమా శంకర్ రెడ్డి, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐ ఏజెంటిక్‌తో వైద్యరంగంలో ప్రయోజనాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్


సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

ఎఐ ఏజెంటిక్‌తో వైద్యరంగంలో ఎన్నో ప్రయోజనాలున్నాయని కదిరి పట్టణానికి చెందిన ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు, మాజీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు సివి. డాక్టర్ మదన్‌కుమార్ అన్నారు. హైదరాబాద్ నందు మూడురోజుల పాటు ఎఐ భారత్ ఉత్సవ్ 2025 ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ మదన్‌కుమార్ మాట్లాడుతూ ఎఐ ఏజెంటిక్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జబ్బు యొక్క నిర్ధారణలో ముఖ్యంగా గుండెపోటును త్వరితగతిన కనుక్కోవడానికి క్యాన్సర్ ను త్వరగా కనుక్కోవడానికి, శరీరంలో చీము చేరడాన్ని త్వరగా కనుక్కోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది డాక్టర్లకు ప్రత్యామ్నాయం కాదన్నారు. డాక్టర్లకు వ్యాధి నిర్ధారణలో వ్యాధి చికిత్సలో మరియు పేషంట్ల లకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎంతో ఇది ఉపయోగపడుతుందన్నారు. భారత్ ఉత్సవ్2025 చైర్మన్ సి.వి .మహేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇజి.రాజన్, డెరిక్ జోస్, డాక్టర్ శ్రీనివాస్, మాజీ సిబిఐ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ, రిటైర్డ్ జడ్జి మాల్యాద్రి రిటైర్డ్ జడ్జ్ , డాక్టర్ సుబ్బా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల నిర్వహణలో అలసత్వం తగదు

ప్రజాశక్తి - బత్తలపల్లి

గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన యాప్ ల నిర్వహణలో అలసత్వం వహించవద్దని సిడిపిఒ సరస్వతి కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రాజెక్ట్ మీటింగ్లో ఎఫ్ ఆర్ ఎస్, ఆధార్, ఫుడ్ రిసీవ్స్, పోషణ ట్రాకర్ యాప్ ల గురించి వివరించారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణలో సమయపాలన పాటించాలని, ప్రతి ఒక్కరూ యూనిఫాంలోనే ఉండాలని చెప్పారు. అంతకు ముందు ప్రాజెక్ట్ కార్యదర్శి, ఎర్రాయిపల్లి అంగన్వాడి కార్యకర్త వాసంతి మతికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. వాసంతి మృతితో ఖాళీ అయిన ఎర్రాయపల్లి అంగన్వాడీ పోస్టును తన కూతురికి ఇవ్వాలని వాసంతి భర్త నారాయణస్వామి అర్జీ ఇచ్చినట్లు సిడిపిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు చంద్రమ్మ, ఎర్రమ్మ, బ్లాక్ కోఆర్డినేటర్ ఓబులమ్మ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రేపు ఉచిత మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

ప్రజాశక్తి - హిందూపురం

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఆదివారం అల్ హిలాల్ స్కూల్ లో ఉచిత మూర్ఛవ్యాధి చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు జెవివి ప్రతినిధులు డాక్టర్ ఈటి రామ్మూర్తి, రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్న సంబంధిత పాఠశాలలో ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని మూర్ఛ రోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని మొరంపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మొరసలపల్లి, దిగువపల్లి తండా, మొరంపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్లకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు, వినియోగదారులు, రైతులు, పరిశ్రమల యాజమాన్యం సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటించని 'లిటిల్ ఫ్లవర్'


తనకల్లులో లిటిల్‌ఫ్లవర్ స్కూల్

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో గల లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం ప్రైవేట్ పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. విద్యార్థులతో అధికఫీజులు వసూలు చేస్తున్నారు. పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవటంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ఆటస్థలం లేదు. బాల, బాలికలకు ప్రత్యేకంగా మూత్రశాలలు ఏర్పాటు చేయలేదు. అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తున్నారన్న విమర్శలున్నాయి. పాఠశాల బస్సులకు ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించడం లేదు. అర్హులైన డ్రైవర్లను ఏర్పాటు చేయడం లేదు. దీంతో ఏవైనా ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అలాగే పాఠశాల యూనిఫామ్ కూడా యాజమాన్యమే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పాఠశాల నిర్వహణలో నిబంధనలు పాటించడం లేదు. నిబంధనలకు తిలోదకాలిచ్చి పాఠశాల నడుపుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణ లోపం తోని ఇవన్నీ జరుగుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత జిల్లా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి నిబందనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

20న నంద్యాలలో రైతుసదస్సు


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

సోలార్ పేరుతో వ్యవసాయ భూములు ప్రైవేటు కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు ఇస్తున్న ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 20వ తేదీ నంద్యాలలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో రాయలసీమల్నోఇ నంద్యాల జిల్లాలో 25 వేల ఎకరాలు, కర్నూలు జిల్లాలో 20 వేల ఎకరాలు, అనంతపురం జిల్లాలో 50వేల ఎకరాలు తీసుకుంటున్నారన్నారు. 30 సంవత్సరాల ఒప్పందంతో ఎకరాకు 31 వేల రూపాయలు లీజు ఇచ్చే విధంగా లేదా ఎకరా ఐదు లక్షల రూపాయలు ఖరీదు తో భూములు కొనుగోలు చేసేందుకు ప్రైవేటు కంపెనీలకు అవకాశం కల్పించిందన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు కొరకు 2500 ఎకరాలు బలవంతంగా సేకరిస్తున్నారన్నారు. రైతులను తమ సొంత భూముల నుండి తరిమేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆయన తెలిపారు. దీనిని వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి, భాగ్య, లక్ష్మన్న, రైతు సోదరులు గోపాల్, చెన్నయ్య, మాధవరెడ్డి, వెంకటేశులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

సిపిఎం మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కదిరి పట్టణంలో ఈ నెల 27 28 తేదీలలో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్. బాషా కోరారు. శుక్రవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాలు జరిగిన పోరాటాలను గుర్తు చేస్తూ భవిష్యత్ కార్యక్రమాలకి రూపకల్పన ఈ మహాసభల్లో జరుగుతుందన్నారు. మహాసభలకు రైతులు, కూలీలు కార్మికులు ఉద్యోగులు ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆలకుంట మారుతి, సిఐటియు నాయకులు హైదర్ వలి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు



మేడపైన ఉన్న గ్రంథాలయం

మేడపై గ్రంథాలయం

మెట్లు ఎక్కలేని పాఠకులు అద్దె భవనంలో కొనసాగింపు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరిలో ఉన్న గ్రంథాలయానికి వెళ్లాలంటే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయ భవనం మేడపై అద్దె భవనంలో కొనసాగుతోంది. దీంతో వృద్ధులు, ఇతర పాఠకులు మెట్లు ఎక్కి గ్రంథాలయంలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. లక్ష కుపైగా జనాభా కలిగిన కదిరి పట్టణంలోని గ్రంథాలయం నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అంతేకాకుండా మేడ పైకి ఎక్కి ఇబ్బందులు పడడం కన్నా గ్రంథాలయానికి పోకపోతేనే మేలు కదా అని కొందరు పాఠకులు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో పాటు పలుమార్లు అద్దె భవనాలను మారుస్తుండటంతో అందులోకి వెళ్లడానికి పాఠకుల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది. అరకొర వసతులు ఉన్న,అద్దె భవనాల్లో పుస్తకాలను అమర్చేందుకు సరైన సదుపాయం లేక పోవడం కూడా పాఠకుల్లో నిరాశను నింపుతుంది. కూర్చొనేందుకు సరైన స్థలం లేకపోవడంతో సంఖ్య మరింత తగ్గిపో తోంది. కనీస సౌకర్యాలతో సొంత భవనం లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని పాఠకులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు చేపట్టాలి

ధర్మవరం రూరల్ : డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను వెంటనే చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహమూర్తి,శేషం మహేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు పూర్తయ్యి మూడు నెలలు గడుస్తున్న డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ మొదలు కాలేదని తెలిపారు. ప్రవేశాలను పూర్తిగా ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించాలని డిమాండ్ చేశారు

అర్హులందరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోండి

కలెక్టర్ టిఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని అందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఒ విజయ సారథి తో కలిసి ఓటరుజాబితాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవచ్చున్నారు. అదే సమయంలో మృతి చెందిన వ్యక్తులు, గ్రామం వదిలేసి శాశ్వతంగా వలస పోయినవారు, ఒక వ్యక్తి పేర్లు రెండు సార్లు నమోదు అయిన వారి పేర్లు ఓటర్ జాబితా నుంచి తొలగించబడతాయన్నారు. ఓటర్ల పేరు, వయసు ఇతర వివరాలతో పొరపాట్లు జరిగి ఉంటే సవరణ చేసుకోవచ్చున్నారు. ఓటర్ నమోదుకు 1576 మంది బూత్ లెవల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాలలో ఆరుగురు బిఎల్ఒలను నియమిస్తూ వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే గ్రామాల్లో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటా తిరిగి అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేస్తున్నారన్నారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో ఓటరు నమోదుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బిజెపి భరత్ కుమార్, వైసిపి కన్వీనర్ రవి నాయక్, బిఎస్‌పి సతీష్ కుమార్, నాగరాజు, సంబంధిత ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించండి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు అన్ని అర్హులకు అందాలని, విధులలో నిర్లక్ష్యం వహిస్తే అలాంటి అధికారులకు కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లాలోని ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవో లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పి 4, పిజిఆర్ఎస్ అర్జీలు, వసతిగృహాల తనిఖీ తదితర అంశాలపై వారితో మాట్లాడారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని, గ్రామ ప్రజలందరూ పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వసతిగృహాల్లో సమస్యలు గుర్తించి నివేదికలు ఇవ్వాలన్నారు. మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా అని కనుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ విజయసారధి, సిపిఒ విజయ్ కుమార్, పంచాయతీ అధికారి సమత, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల పనులు వేగవంతం చేయండి : జాతీయ రహదారుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో జాతీయ రహదారులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌ఎన్ఎస్ఎస్ పనులు మూడు ఏజెన్సీలకు అప్పగింపడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఈనెల ఆఖరిలోగా టర్నల్ మట్టి పనులు పూర్తి చేస్తామని వివరించారు. ఆగస్టు 20 లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో హెచ్‌ఎన్ఎస్ఎస్, ఎస్ఈ రాజా, స్వరూప్ కుమార్, ఈఈ మురళి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా సస్పెండ్ చేయడం బాధాకరం

కొండూరు వేణుగోపాల్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశించిన నియమావళి ప్రకారం పని చేశానే తప్ప ఎక్కడా పార్టీకి వ్యతిరేకంగా పనిచేయలేదని ఇటీవల వైసిపి నుంచి సస్పెండ్ కు గురైన మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన నాయకులు, కార్యకర్తలతో కలిసి వేణుగోపాల రెడ్డి తన కోల్డ్ స్టోరేజ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం శ్రమించానన్నారు. హిందూపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దీపిక, నాయకుల మధ్య అసెంబ్లీ ఎన్నికల అనంతరం సయోధ్య లేకపోవడంతో కొందరు నాయకులను వ్యతిరేకించానే తప్ప పార్టీని ఎన్నడూ వ్యతిరేకించ లేదని తెలిపారు. అలాంటి తరుణంలోఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉన్నఫలంగా పార్టీ నుండి సస్పెండ్ చేయడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేశానన్నారు. పార్టీ కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేయడంతో పాటు సొంత పనులు వదులుకొని శ్రమించామని, అయితే పార్టీకి తాము చేసిన సేవలకు గుర్తింపుగా సస్పెండ్ బహుమానం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. సమన్వయకర్తకు నాయకుల మధ్య ఉన్న విభేదాలు సరి చేయాల్సింది పోయి ఏకపక్ష నిర్ణయాలతో ఇద్దరి కౌన్సిలర్లను, ఇద్దరి మాజీ సమన్వయకర్తలను, ఇద్దరి నాయకులను సస్పెండ్ చేయడం భావ్యం కాదన్నారు. సమన్వయకర్త అందరిని కలుపుకొని పోయి ఉంటే ఆరుగురు కౌన్సిలర్లు ఉన్న టిడిపికి మున్సిపల్ చైర్మన్ పదవి పోయేది కాదని తెలిపారు. సమన్వయకర్త అసమర్థత వల్లే అత్యధిక శాతం ఉన్న వైసీపీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్‌పిటిసిలు, నాయకులు దూరమయ్యారన్నారు. నిస్వార్థంతో పైసా ఆశించకుండా వైసిపి అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో కృషి చేశానని, ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా పార్టీ లైన్ దాటలేదని పేర్కొన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం మేరకే వైయస్సార్ జయంతి వేడుకలను నిర్వహించామన్నారు. పార్టీ పెద్దలు ముందు చూపు లేకుండా ఇంత నెట్ వర్క్ ఉన్న తనను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు.కార్యకర్తలకు నిరంతరం అండగా నిలబడతానని, ఎవరూ భయపడనవసరం లేదని భరోసా ఇచ్చారు. సస్పెన్షన్‌పై పార్టీ పెద్దలు పునరాలోచించి సరైన న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు సాదిక్, నారాయణస్వామి, సిఎన్ పి నాగరాజు, రాజారెడ్డి తో పాటు నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

అండర్ - 16 జిల్లా క్రికెట్ జట్టుకు కదిరి క్రీడాకారుడు

ప్రజాశక్తి - కదిరి టౌన్



సంతోష్

ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కడపలో జరిగే దక్షిణ మండల అంతర జిల్లాల అండర్ 16 క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా అనంతపురం క్రికెట్ జట్టు తరుపున కదిరి క్రీడాకారుడు సంతోష్ ఎంపిక అయ్యాడు. సంతోష్ జిల్లా ప్రొబబుల్స్ పోటీలలో విశేష ప్రతిభ కనబర్చారు. సంతోష్ సాధన స్కూల్ నందు ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్నాడు. సంతోష్ జిల్లా పోటీలలో రాణించి మరింత పై స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంతోష్‌ను ఉపాధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు, సాధన పాఠశాల యాజమాన్యం అభినందించారు.

రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగుకార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలకు రూ,3, 873 కోట్లతో సాగునీరు తాగునీరు అందించే హంద్రీనీవా ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. హంద్రీనీవా జలాలు వస్తే రాయలసీమలోని 6.03 లక్షల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, కౌన్సిలర్ లక్ష్మీనరసమ్మ, టిడిపి నాయకులు ఉమాపతి, సుధాకర్, మాజీ కౌన్సిలర్ రాజప్ప, సింగల్ విండో డైరెక్టర్ ఆంజనేయులు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

'సుపరిపాలనలో తొలి అడుగు' బూటకం : వైసిపి



సమావేశంలో మాట్లాడుతున్న దీపిక

ప్రజాశక్తి - చిలమత్తూరు

కూటమి ప్రభుత్వం సుపరిపాలనలో తొలి అడుగు అంటూ చేస్తున్న ప్రచారం అంతా బూటకమనిహిందూపురంలో పరిపాలన అన్నదే లేదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపిక విమర్శించారు. వైసిపి చేపట్టిన 'బాబు ష్యూరిటీ .. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని మరవకొత్తపల్లి సమీపంలోని విరాట్ ప్యాలెస్‌లో ఆపార్టీ మండల విస్తత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మేనిఫెస్టోని గుర్తుకుతెస్తూ బాబు చేసిన మోసం గురించి వివరించే క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం దీపిక మాట్లాడుతూ హిందూపురంలో అభివద్ధి పేరిట రూ. 92 కోట్లు మంజూరు అయ్యాయని ప్రచారం చేసుకుంటున్నా టిడిపి నేతలు మంజూరైన డబ్బు దేనికి ఖర్చు చేశారో కూడా చెప్పాలన్నారు.. చేయని పనులకు బిల్లులు చేయించుకునే సంస్కృతికి తెరతీసారని కేవలం నేతల జేబులు నింపుకోవడానికి కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని ఆరోపించారు. ఎక్కడ చూసినా దోపిడీలు దౌర్జన్యాలు హిందూపురం నియోజకవర్గంలో సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ మెడలు వంచి వారితో పని చేయించేందుకే వైసిపి నడుం బిగించిందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హిందూపురం నియోజకవర్గం లో పలువురు నేతల సస్పెన్షన్ అంశం తమ పరిధిలోనిది కాదని అధిష్టానం తీసుకున్న నిర్ణయమని అన్నారు. తమను ఏ నేతను కూడా పోగొట్టుకునే ఉద్దేశం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేణు రెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని మాజీ మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, పురుషోత్తమ రెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, గిరిధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కదిరి మార్కెట్ యార్డ్ పీఠంపై జనసేన అనసూయ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పీఠం జనసేన పార్టీ దక్కించుకుంది. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేసిన సాధారణ మహిళకు ఆ పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తగిన గుర్తింపును ఇస్తూ కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నంబులపూలకుంట మండలం మేకల చెరువు కి చెందిన ఆ పార్టీ మండల కన్వీనర్ చౌదరి సతీమణి అనసూయను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుండి తాము జనసేన పార్టీలోకి వచ్చామన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రతి పక్షంలో ఇచ్చిన ప్రతి పిలుపును అందుకొని పార్టీ కోసం అధినేత ఆశయ సాధన కోసం పనిచేశామన్నారు. గత ఏడాది రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కదిరి కూటమి అభ్యర్థి ప్రస్తుత ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విజయం కోసం పనిచేశామన్నారు. ఈ నేపథ్యంలో తమ కష్టాన్ని గుర్తించి తమకు ఈ అవకాశం కల్పించారు. తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి రైతుల అభివృద్ధి కోసం పనిచేస్తామని మార్కెట్ యార్డ్ ను అభివద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా తమ పై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పార్టీ నేత ఎంఎల్‌సి నాగబాబు , నాదెండ్ల మనోహర్ , ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ తదితరులకు అనసూయ తన కృతజ్ఞతలు తెలిపారు.



అనసూయ



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

రూ. 92 కోట్లతో 'పురం' సమగ్రాభివృద్ధి

మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని రూ. 92 కోట్ల నిధులను మంజూరు చేయించారని, ఆ నిధులు వచ్చిన వెంటనే పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల్లోనూ రోడ్లు మురుగు కాలువల నిర్మాణాలను చేపడతామని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ తెలిపారు. వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ తన సొంత వార్డు పరిధిలోని ధర్మపురంలో ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎసిపి చంద్రమ్మ, ఏఈ జనార్ధన్, శానిటరీ ఇన్స్ పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, టిడిపి నాయకులు షబ్బీర్, అశ్వర్థ నారాయణ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు సహకరించాలి

ప్రజాశక్తి - హిందూపురం

పారిశుధ్యం మెరుగుకు అధికారులతో పాటు ప్రజలు కూడా సహకరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి శివ నారాయణ రెడ్డి కోరారు. శుక్రవారం హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట పంచాయతీలో చెత్త సేకరణ పై అవగాహన కల్పించారు. అదేవిధంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తడి చెత్త, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి పంచాయతీ కార్మికులకు అందజేయాలన్నారు. అనంతరం ఓవర్ హెడ్ ట్యాంక్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించడంతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివకుమార్, కెంచరాయప్ప, పంచాయతీ సర్పంచి రత్నమ్మ చిన్నవీరప్ప, ఎంపీటీసీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శి హరిత తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అభివృద్ధికి అందరి సహకారం అవసరం

ఎమ్మెల్యే పల్లె సింధూర



కౌన్సిల్ మీట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి అభివృద్ధికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అధికారులు అందరూ కలిసి పనిచేయాలని శాసనసభ్యురాలు పల్లె సింధూర సూచించారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పన్నులు వసూళ్లలో మున్సిపాలిటీ వెనుకబడిందన్నారు. వసూలు చేయకపోతే అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పాలకమండలి సభ్యులు అధికారులు సంయుక్తంగా పన్నుల వసూళ్లకు చేయూతనివ్వాలన్నారు. వచ్చే నవంబర్‌లో సత్య సాయి 100 వ జయంతి ఉత్సవాలు జరగనున్నాయని దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఏ అసౌకర్యం కలగకుండా పుట్టపర్తికి నూతన శోభ తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. గత కౌన్సిల్లో చర్చించిన సమస్యలు ఎంతవరకు పరిష్కరించారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మున్సిపాలిటీలో ఇటీవల మృతిచెందిన పారిశుధ్యకార్మికుల కుటుంబాలలో ఐదు మందికి కారుణ్య నియామకాల క్రింద ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఎమ్మెల్యేకి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి, కౌన్సిల్ తరపున కమిషనర్ క్రాంతికుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు తిప్పన్న, శ్రీలక్ష్మీ నారాయణ రెడ్డి, కౌన్సిలర్లు చెరువు భాస్కర్ రెడ్డి, సూర్య గౌడ్, సాయి గీత, వెంకట రవణమ్మ, లక్ష్మీ నరసమ్మ, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రెవెన్యూ డివిజినల్ అధికారి మహేష్ శుక్రవారం ధర్మవరం ఆర్‌టిసి బస్టాండ్‌ను తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో ఆర్టీసీ సేవల పట్ల నమ్మకాన్ని పెంచడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడం. కోసం తీసుకోవలసిన చర్యలపై బస్టాండ్‌ను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించామన్నారు.బస్టాండ్ పరిసరాల పరిశుభ్రత, ప్రయాణికుల నిరీక్షణ గదుల స్థితి, తాగునీటి సదుపాయాలు, సైన్‌బోర్డులు, వెలుతురు, భద్రతా ఏర్పాట్లు, చంటి బిడ్డలకు పాలు ఇచ్చు గది, పార్సిల్ కార్యాలయం, టికెట్ కౌంటర్లను పరిశీలించారు. ప్రత్యేకంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్సుల సకాలంలో రాకపోకలు, టైమ్ టేబుల్ ప్రదర్శనపై శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే ప్రజల ఫిర్యాదులను స్వీకరించే పద్ధతులు సరైన విధంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమములోడిపో మేనేజరు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం డివిజన్ వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్ డిమాండ్ చేశారు. హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఎస్ డబ్ల్యూకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు. శిథిలమైనా భవనాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడం లేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్నూరు అంజి, మంజు, సురేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు

ప్రధానమంత్రి సురక్ష బీమాపై అవగాహన

ప్రజాశక్తి - గాండ్లపెంట

ప్రధానమంత్రి సురక్ష బీమా జీవనజ్యోతి, బీమా వయోజన పథకాలపై మండల పరిధిలోని రెక్కమాన్ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం కురుమామిడి గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ప్రతాప్ ఆర్థిక కౌన్సిలర్ నారాయణ తదితరులు మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన ప్రీమియం ప్రతి ఒక్కరు 20 రూపాయలు చెల్లిస్తే ప్రమాదవశాత్తుతో మరణిస్తే నామినీకి రెండు లక్షల రూపాయలు చెల్లిస్తారని అన్నారు జీవనజ్యోతి యోజన ప్రజలు సంవత్సరానికి 346 చెల్లిస్తే 18 సంవత్సరాలు నుంచి 50 సంవత్సరాల లోపల వారు సాధారణ మరణిస్తే నామిని రెండు లక్షల రూపాయలు చెల్లిస్తారని చెప్పారు. కార్మికుల వద్ధాప్తంలో ఇబ్బంది పడకుండా ఉండాలంటే అటల్ పెన్షన్ యోజన పథకాన్ని వినియోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది బిసి నరసింహులు, ఆర్థిక అక్షరాక్ష్యత కేంద్ర కౌన్సిలర్ నారాయణ మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పొగాకు ఉత్పత్తులు విద్యాసంస్థలకు దూరంగా ఉంచాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థల వద్ద 100 మీటర్ల దూరంలో సిగరెట్, పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయించడం నిషేధించడమైనదని, అందుకోసం పోలీస్ అధికారులు పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్న షాపులను తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పోలీసు అధికారులు తనిఖీలు చేపట్టి తమ పరిధులలోని ఆయా పాఠశాలు, కళాశాల, విద్యా సంస్థలను సందర్శించి 100 మీటర్లలోపు టీ షాపులు, పాన్ షాపులు, కిరాణం షాపులలో సిగరెట్లు, కైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు అమ్మడం నిషేధమని షాప్ నిర్వాహకులకు తెలిపారు.